సాక్షి జగిత్యాల

గురువారం। 24। జూలై। 2025

ఉమ్మడి జిల్లాలో బుధవారం కురిసిన వర్షపాతం వివరాలు (సెంటీమీటర్లలో)

జిల్లా	అత్యధికం	అత్యల్పం
జగిత్యాల	నేరెళ్ల 9.01	కథలాపూర్ 0.9
కరీంనగర్	కరీంనగర్ 9.30	గంగాధర 0.4
పెద్దపల్లి	ధర్మారం 7.86	పాలకుర్తి 1.74
రాజన్నసిరిసిల్ల	ముస్తాబాద్ 7.69	రుద్రంగి 0.47



న్యూస్‌రీల్

జిల్లాలో 91 మిల్లీమీటర్ల వర్షం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం ఉదయం 8.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. అత్యధికంగా ధర్మపురి మండలం నేరెళ్లలో 91 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కథలాపూర్‌లో 9.8 మి.మీగా నమోదైంది. సారంగాపూర్‌లో 79.3, ఎండపల్లి మండలం గుల్లకోటలో 73.5, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 54.8, మేడిపల్లిలో 49.8, గొల్లపల్లిలో 48.8, బుగ్గారం మండలం సిరికొండలో 47.3, ఎండపల్లిలో 41.8, ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లిలో 41.8, కోరుట్లలో 40.3 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

నృసింహుడి సన్నిధిలో రద్దీ



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ముందుగా గోదావరిలో స్నానాలు చేశారు. అనంతరం స్వామివార్లను దర్శించుకున్నారు.

ఘనంగా మహా లింగార్చన



ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా లింగార్చన నిర్వహించారు. రుద్రనమకం, మాన్య సూక్తం, లక్ష్మీసూక్తం, పురుష సూక్తం తదితర పూజలు చేశారు. ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు జిల్లా విద్యార్థులు




ఎంపికైన క్రీడాకారులు

జగిత్యాల: సబ్ జూనియర్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికైనట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాదం మహేందర్, గువ్వ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో షేక్‌పేట్ మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా తరఫున దుగ్యాల రాఘవరావు, పాదం హర్షిత్‌పటేల్, స్వరాలి, మోక్షిత, విద్యాదీప్, అక్షయ్‌వర్మ, రిశ్వాంత్, శశాంక్ పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

'సూరమ్మ' కాలువల భూసేకరణకు రూ.10కోట్లు మంజూరు

కథలాపూర్: మండలం కలిగోట శివారులోగల సూరమ్మ ప్రాజెక్ట్ నుంచి కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి భూసేకరణకు ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకోవడంతో కాలువల నిర్మాణాలపై దృష్టి సారించామని, కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాల్లోని గ్రామాల్లో భూముల సర్వే పూర్తయిందని, ఈ మేరకు భూములకు రూ.10 కోట్లు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని వివరించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న పొన్నం రమేశ్

రాయికల్: సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని ఇటిక్యాల, బోర్నపల్లి, చింతలూరు, ఒడ్డెలింగాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, హెల్త్‌కార్డు అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి లక్కిడి రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి దొంతి సతీశ్ పాల్గొన్నారు.

శునకాలతో భయంభయం

- మందలుగా తిరుగుతున్న కుక్కలు
- జిల్లాకేంద్రంలోని మూడు వార్డుల్లో ఎమర్జెన్సీ
- రోడ్లవెంట వెళ్తున్నవారిపై దాడులు
- భయాందోళనలో స్థానికులు



జిల్లాకేంద్రంలోని మూడో వార్డులో మందలుగా తిరుగుతున్న వీధి కుక్కలు

జగిత్యాల: జిల్లాకేంద్రంలో మళ్లీ కుక్కల బెడద మొదలైంది. రోడ్లపైకి రావాలంటేనే చిన్నారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని వీధుల్లో కుక్కలు వెంటబడి కరుస్తుండటంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. గతంలో కుక్కల బెడద నుంచి తప్పించాలని అత్యధికంగా ఫిర్యాదులు రావడంతో హైకోర్టు స్పందించి వెంటనే నివారించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాకేంద్రంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

డంపింగ్‌యార్డు వద్ద యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్

జిల్లాకేంద్రంలోని టీఆర్‌నగర్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 36 కెన్నెల్స్‌ను ఏర్పాటు చేసి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టారు. గతంలో టెండర్లు నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన ఓ ఏజెన్సీ ఒక్కో కుక్కకు రూ.1450 చొప్పున ఒప్పందం చేసుకున్నారు. 2024 ఆగస్టు 9న కుక్కలను పట్టేందుకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలో సుమారు రెండు వేల వరకు కుక్కలను పట్టి కు.ని ఆపరేషన్లు చేశారు. దీనికో కమిటీ వేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేలా చేశారు. చాలావరకు ఆపరేషన్లు చేసి కుక్కలను తిరిగి వీధుల్లో విడిచిపెట్టారు. ఆపరేషన్లు చేసినట్లు గుర్తుగా చెవి కత్తిరించారు. ఏమైందో ఏమోగానీ కు.ని. నిలిపివేయడంతో మళ్లీ మొదటికి వచ్చింది. బిల్లులు విడుదల చేయకపోవడంతో వారు ఆపేసినట్లు తెలిసింది. జనవరి నుంచి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిలిచిపోయాయి. అప్పటినుంచి మళ్లీ కుక్కల బెడద ఎక్కువైంది.

పెరుగుతున్న కుక్కల దాడులు

జనవరిలో నిలిచిపోయిన కుక్కల కు.ని ఆపరేషన్లను ఇప్పటివరకు మళ్లీ చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలో దాదాపు ఐదు నుంచి ఎనిమిది వేల కుక్కలు ఉంటాయని అంచనా. జిల్లా కేంద్రంలోని ప్రతి వార్డుల్లో గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఉదయం రోడ్ల వెంటే..

తెల్లారిందంటే చాలు.. ప్రధాన రోడ్ల వెంట మందలుమందలుగా కనిపిస్తున్నాయి. ఉదయంపూట బడికి వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లే ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే చిన్నారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలు వెంటపడుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కొందరు తీవ్రంగా గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. కుక్కలకు కు.ని. నియంత్రణ ఆపరేషన్లు నిరంతరం చేపడతామని చెప్పినప్పటికీ అర్ధంతరంగా నిలిచిపోవడంతో మళ్లీ ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు వార్డుల్లో ఎమర్జెన్సీ

జిల్లా కేంద్రంలోని మూడు వార్డుల్లో ఎమర్జెన్సీగా కుక్కలను పట్టాలని అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టడం లేదు. అధికారులు స్పందించి ఆ మూడు వార్డుల్లో కుక్కలను పట్టేలా ఏజెన్సీ వారితో మాట్లాడి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుక్క కరిస్తే ఇబ్బందులే...

సొల్లు కార్చే కుక్క కరిస్తే రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. కాటు వేసిన కొద్ది రోజులకే జ్వరం, తలనొప్పి, కండరాలు బిగుసుకుపోయి విపరీతంగా అలసటకు గురవుతారు. దీంతో సకాలంలో వైద్యం అందకపోతే కుక్కకాటుతో చనిపోయే ప్రమాదం సైతం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. నిత్యం కేసులు పెరుగుతూనే ఉన్నాయి.



యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్

మళ్లీ ప్రారంభిస్తాం

ప్రస్తుతం నిలిచిపోయినప్పటికీ వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. మూడు వార్డుల్లో ఎమర్జెన్సీ ఉన్నట్లు తెలిసింది. వారితో మాట్లాడి ఆపరేషన్లు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– చరణ్, ఏఈ

ఒకే కుటుంబానికి 35 బస్తాల యూరియా

- కలెక్టర్ తనిఖీలో వెల్లడి
- ఏఈవోపై ఆగ్రహం



ఇబ్రహీంపట్నం సొసైటీలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పీఏసీఎస్ నుంచి ఒకే కుటుంబానికి 35 బస్తాల యూరియా పంపిణీ చేశారు. ఈ విషయం కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీలో బయటపడడంతో ఆయన ఏఈవో వినోద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏసీఎస్‌లో తనిఖీలు చేపట్టిన కలెక్టర్.. యూరియా నిల్వలపై ఆరా తీశారు. మే నెలలో కోజన్‌కొత్తూర్‌కు చెందిన ఒకే కుటుంబసభ్యులు అలేఖ్య, గంగాధర్, గంగరాం పేరిట 35 యూరియా బస్తాలు ఇచ్చినట్లు గమనించారు. సదరు రైతుల ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకాల జిరాక్స్ కాపీలు చూపించాలని సీఈవో సతీశ్‌కుమార్‌కు సూచించగా.. లేవని సమాధానం చెప్పారు. దీంతో సతీశ్‌కుమార్‌తోపాటు ఏఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ జరిపి నివేదించాలని డీఏవో భాస్కర్‌ను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఔట్‌పేషెంట్లు, రికార్డులు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు డెంగీ కేసులు నమోదైనట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి రికార్డులు పరిశీలించారు. భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. కొత్త రేషన్‌కార్డుల కోసం ఇప్పటివరకు 1300 దరఖాస్తులు రాగా.. 293 పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఏవో భాస్కర్, డీఎంహెచ్‌వో ప్రమోద్ కమార్, ఏడీఏ రమేశ్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రామకృష్ణరాజు, ఏవో రాజ్‌కుమార్, ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రమేశ్, వైద్యాధికారి హరీశ్, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పక్కా భవనాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తున్నామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అద్దె ఇళ్లలో కొనసాగుతున్న కేంద్రాలకు కొత్త భవనాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కరెంట్ లేని రోజుల్లో దీపాల కింద చదువుకున్నామని, నేడు డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పాపం.. దయనీయం

- విద్యుత్ షాక్ బాధితుల దీనస్థితి
- కనికరించని కరెంటు శాఖ
- నయాపైసా అందని వైనం
- దాతల కోసం ఎదురుచూపులు



కాలిపోయిన శరీరంతో వెంకటరెడ్డి రాజేశ్

కోరుట్ల: కోరుట్లలో గణపతి విగ్రహాలను తరలిస్తుండగా గత నెల 15న జరిగిన విద్యుత్ షాక్‌లో గాయపడిన ఎనిమిది మందిలో నలుగురి పరిస్థితి దయనీయంగా ఉంది. నలుగురిలో ఇద్దరు మహారాష్ట్రకు వెళ్లిపోగా.. వెల్లుట్ల కృష్ణకుమార్, వెంకటరెడ్డి రాజేశ్ పరిస్థితి ఘోరంగా ఉంది.

డిశ్చార్జికీ డబ్బుల్లేవ్

వెంకటరెడ్డి రాజేశ్‌ను ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాదంలో తల, వీపు, భుజాలు, కాళ్లుచేతులు కాలిపోవడంతో ముందుగా హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. పరిస్థితి కుదటపడకపోవడంతో కరీంనగర్ తీసుకొచ్చారు. రాజేశ్‌పైనే కుటుంబం ఆధారపడి బతుకుతున్న క్రమంలో చేతిలో నయాపైసా లేక దాతల సాయం కోసం అర్థించారు. కాంగ్రెస్ నాయకుడు ఎడ్ల రమేశ్ చొరవతో దాతల నుంచి సుమారు రూ.1.20 లక్షలు సమకూరగా.. వాటిని ఆసుపత్రిలో చెల్లించారు. తరువాత చికిత్సకు సుమారు రూ.9 లక్షలకు పైగా ఖర్చు వచ్చింది. ప్రస్తుతం రాజేశ్ డిశ్చార్జి అయ్యే పరిస్థితి ఉన్నా.. డబ్బులు లేక బిల్లు కట్టలేక అక్కడే ఉండిపోయారు. నాలుగు రోజులుగా సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

చేయి కోల్పోయాడు..

ప్రమాదంలో గాయపడిన వెల్లుట్ల కృష్ణకుమార్ నెలపాటు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఒక చేయిని పూరిగా తొలగించారు. ఇక కృష్ణకుమార్ తల్లి రేఖ, భార్య ఆర్తి ఆవేదన అంతా ఇంతా కాదు. ఇదే ప్రమాదంలో వెల్లుట్ల సాయికుమార్ చనిపోయాడు. కృష్ణకుమార్ చేయి కోల్పోయాడు. మొత్తంగా విద్యుత్ షాక్ ప్రమాదం ఆ ఇంట్లో పెను విషాదాన్ని నింపింది. అసలే పెద్ద కొడుకు చనిపోయిన బాధతో ఉన్న ఆ కుటుంబం కృష్ణకుమార్ ప్రాణాలు కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో కృష్ణకుమార్‌ను ఎలా బాగు చేయించాలని ఆ కుటుంబం దీనంగా చూస్తోంది.

కనికరించని కరెంటు శాఖ

ప్రమాదం జరిగిన తరువాత చనిపోయిన కుటుంబాలతోపాటు గాయపడిన వారికి సాయం అందిస్తామన్న విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటివరకు నయాపైసా ఇవ్వలేదు. చనిపోయిన రెండు కుటుంబాలకు మాత్రం రూ.5లక్షల చొప్పున పరిహారం ఇచ్చారు. వల్లంపల్లి 11 కేవీ లైన్ తీగలు వేలాతున్నాయని, వాటిని మార్చాలని గతంలోనే లైన్‌మెన్లు సూచించినా విద్యుత్ శాఖ అధికారులు ఆ పనిపై దృష్టి సారించలేదు. ఫలితంగా గణపతి విగ్రహం తరలిస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. దీనిపై కోరుట్ల ట్రాన్స్‌కో సిబ్బంది 14 మందికి ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇటీవల కథలాపూర్ మండలంలోని ఓ గ్రామంలో చిన్నపాటి ట్రిప్ చేసిన కారణంగా ఓ లైన్‌మన్‌ను సస్పెండ్ చేసిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు.. ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ప్రమాదంపై మాత్రం ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.



- ఈమె పేరు లక్ష్మీ. ఈమె కుమారుడు వెంకట్‌రెడ్డి రాజేశ్ నెల క్రితం కోరుట్లలో జరిగిన కరెంట్ షాక్ ఘటనలో గాయపడి చావుబతుకుల్లో ఉన్నాడు. ఇప్పటికే రూ.10 లక్షల దాకా ఖర్చయ్యింది. కొడుకును రక్షించుకునేందుకు ఆర్థిక సాయం చేయండి అని అర్థిస్తోంది.



- 'కరెంటు షాక్‌తో నా పెద్ద కొడుకు వెల్లుట్ల సాయికుమార్ అక్కడికక్కడే చనిపోయిండు. రెండో కొడుకు కృష్ణ తీవ్రంగా గాయపడగా ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించినం. నెల గడిచింది. ఒక చేయి తొలగించారు. మేం నలుగురం ఆసుపత్రి దగ్గర ఉండేందుకు రూ.లక్షకుపైగా ఖర్చు వచ్చింది. కూలీనాలీ చేసుకునేటోళ్లం. చేయిచాచి అడగాలంటే పాణం పోయినంత పనైతంది. బంగారం అమ్మి ఖర్చు పెడుతున్నం..' ఇది కృష్ణ తల్లి రేఖ ఆవేదన.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని 11వ వార్డులో రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డుకు బుధవారం భూమిపూజ చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో వసతుల కల్పనకు రూ.20 కోట్లు, గాంధీనగర్‌లో రూ.18 కోట్లతో బ్లాక్‌స్పాట్ రోడ్లు, రూ.16 కోట్లతో జగిత్యాల–తిప్పన్నపేట రోడ్డు మంజూరైందన్నారు. ధరూర్ క్యాంప్‌లో రూ.5కోట్లతో ఇందిరమ్మ శక్తి భవనం నిర్మిస్తామన్నారు. కమిషనర్ స్పందన, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, బాలె లత, చంద్రయ్య పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేను అద్దె బస్సుల యజమానుల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్‌లో రూ.15లక్షల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మించే.. బాలపల్లిలో రూ.20లక్షలతో నిర్మించే పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. పట్టణాలతోపాటు గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, డీఈ మిలింద్, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక అందించాలి

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందించాలని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని అర్పపల్లి, రేచపల్లిలో రూ.54 లక్షల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. తహసీల్దార్ వహిదొద్దీన్, ఎంపీడీవో గంగాధర్, విండో అధ్యక్షులు మల్లారెడ్డి, నర్సింహ్మారెడ్డి ఉన్నారు.

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి మహర్దశ

జగిత్యాలటౌన్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ దశ తిరిగిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో మహిలక్ష్మి సంబరాలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. జగిత్యాల డిపో మేనేజర్ కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైర్ బస్ అసోసియేషన్ సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.15.31కోట్ల వడ్డీ విడుదల



సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

జగిత్యాలరూరల్: జిల్లాలోని స్వయం సహాయక బృందాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మహిళాశక్తి పథకం ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుతోంది. వారికి ఆర్థిక సహాయం అందించడంతోపాటు, ఉత్పత్తి చేసిన వస్తువులను విక్రయించేందుకూ అవకాశం కల్పిస్తోంది. బ్యాంక్ రుణాలతోపాటు, స్త్రీనిధి రుణాలు అందిస్తోంది. ఇందులో భాగంగా ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలకుగాను జిల్లాలో 12,800 మంది సభ్యులు తీసుకున్న రుణాలకు ఆర్నెళ్ల వడ్డీ రూ.15.31కోట్లు మంజూరు చేసింది. ఆ వడ్డీని మహిళ సంఘ సభ్యుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నారు.

పలు రకాల యూనిట్లకు ఆర్థిక సహాయం

మహిళా సంఘ సభ్యులు మైక్రో ఎంటర్‌ప్రైజెస్, కుట్టు కేంద్రాలు, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్, పాడిపశువుల కొనుగోలు, పెరటి కోళ్ల పెంపకం, పాల కేంద్రం యూనిట్, మీసేవ కేంద్రాల ఏర్పాటు, పౌల్ట్రీఫామ్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాంటీన్ల ఏర్పాటు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ యూనిట్, మహిళాబజార్, వ్యవసాయ ఉపకరణాల అద్దె కేంద్రాలు ఏర్పాటుకు ప్రోత్సహిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్రప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తున్నాయి.

జిల్లాలో మండల సమైక్యలు	18
గ్రామ సమైక్యలు	565
స్వశక్తి సంఘాలు	15,013
మహిళా సంఘ సభ్యులు	1,76,845

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



స్వశక్తి సంఘ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు మహిళాశక్తి పథకంతోపాటు, వారు తీసుకున్న రుణాలకుగాను ఇటీవల ఆర్నెళ్ల వడ్డీ కింద రూ.15.31 కోట్లు విడుదలయ్యాయి. మహిళ సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తోంది.

– రఘువరణ్, డీఆర్డీఏ పీడీ

మెట్‌పల్లి క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



క్లబ్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: పట్టణంలోని మెట్‌పల్లి క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. క్లబ్ స్థలాన్ని విక్రయించడాన్ని నిరసిస్తూ బుధవారం క్లబ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్‌కు చెందిన విలువైన స్థలాన్ని కొందరు సభ్యులు గుట్టుగా విక్రయించి పెద్ద మొత్తంలో లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం దీనిని తక్షణమే స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యామ రాజయ్య, సంగ గంగాధర్, రైసుద్దీన్, పెంట ప్రణయ్, పల్లికొండ ప్రవీణ్, లతీఫ్, రుడావత్ గణేష్ తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి


- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న దావ వసంత

రాయికల్/సారంగాపూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. రాయికల్ పట్టణం, అల్లీపూర్, సారంగాపూర్ మండలం పెంబట్లలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉండాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. రాయికల్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఎనగందుల ఉదయశ్రీ, మారంపల్లి రాణి, పట్టణ అధ్యక్షుడు అనిల్, కన్వీనర్ తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్వర్‌రావు, మహేందర్, పోతుగంటి రాజేందర్‌గౌడ్, సారంగాపూర్ విండో మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు తేలు రాజు, ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాసంస్థలు బంద్



మూసిఉన్న గీతా విద్యాలయం

జగిత్యాలటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ మేరకు విద్యాసంస్థలు మూసివేశారు. ఆర్‌ఎస్‌యూ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకోలేదు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలకు వెళ్లిన విద్యార్థి సంఘాలు బంద్‌కు సహకరించాలని కోరారు. దీంతో విద్యార్థులు క్లాసుల నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు అక్రం మాట్లాడుతూ 25ఏళ్లుగా అటెండర్ ఉద్యోగాలు నియమించలేని దుస్థితిలో రాష్ట్ర విద్యాశాఖ ఉండటం శోచనీయమన్నారు. ఫీజు బకాయిల కారణంగా బెస్ట్ అవైలెబుల్ స్కూల్స్‌లో విద్యార్థులను అనుమతించడం లేదన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఇంటర్‌లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, పెంచిన మెస్, కాస్మోటిక్ చార్జీలు అమలు చేయాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


సిర్రం వెంకటేశ్ మృతదేహం

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలోని నందివాగు ఆవరణ కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారిపై రుద్రంగికి చెందిన సిర్రం వెంకటేశ్(48) అనుమానాస్పదంగా మృతిచెందాడు. రుద్రంగి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు. సిర్రం వెంకటేశ్‌ను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని వెళ్లిన యువకుడి అదుపులోకి తీసుకొని విచారించగా ఇంటి వద్ద దించివెళ్లినట్లు తెలిపాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకస్మికంగా విద్యార్థిని..


కుష్వా(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని కుష్వా(14) బుధవారం ఆకస్మికంగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బాలిక మృతితో తల్లిదండ్రులు భాగ్దేవి, సురేశ్ కన్నీటి పర్యంతమయ్యారు. కుష్వ మృతికి ఎంఈవో మహేశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు.

కువైట్‌లో ఖాసీంపేట వాసి..


సాగర్(ఫైల్)

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన బత్తుల సాగర్(42) ఉపాధి కోసం కువైట్ వెళ్లి గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సాగర్ మూడేళ్లుగా కువైట్ వెళ్తూ.. హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామం వచ్చి తిరిగి వెళ్లాడు. ఈ నెల 22వ తేదీన పని ప్రాంతంలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తోటి మిత్రులు సమాచారం ఇచ్చారని కుటుంబసభ్యులు తెలిపారు. సాగర్‌కు తల్లిదండ్రులు, సోదరుడు, భార్య సారవ్వ, కూతురు ఉన్నారు. గురువారం మృతదేహం గ్రామానికి చేరుకోనున్నట్లు స్థానికులు తెలిపారు.

స్వగ్రామానికి మృతదేహం


రమేశ్ గౌడ్ (ఫైల్)

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌కు చెందిన బత్తిని రమేష్ గౌడ్ (43) మృతదేహం బుధవారం స్వగ్రామం చేరింది. రమేశ్ 14 ఏళ్లుగా గల్ఫ్ దేశమైన బెహరాన్‌లో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై వారం క్రితం తన గదిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. రమేశ్‌కు భార్య మేఘన, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బీదర్ టు కరీంనగర్

- రూ.1.14 కోట్ల విలువైన గుట్కా రవాణా
- బుధవారం వేకువజామున పట్టివేత
- 13 మందిపై కేసు, 11 మంది అరెస్టు

కరీంనగర్‌క్రైం: బీదర్ నుంచి గోదావరిఖని మీదుగా కరీంనగర్‌కు పెద్దఎత్తున గుట్కా తరలిస్తున్న రెండు వాహనాలను కరీంనగర్ వన్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగరంలోని తీగల వంతెన సమీపంలో బుధవారం వేకువజామున పట్టుకున్నారు. రూ.1.14 కోట్ల విలువైన 7,60,000 గుట్కా ప్యాకెట్లు, ఒకరి వద్ద రూ.13,17,850 నగదు, 11 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. గుట్కా రవాణాలో గోదావరిఖనికి చెందిన నలుగురు, కరీంనగర్‌కు చెందిన ఏడుగురు ఉన్నారు. వీరిలో ప్రకాశం గంజ్‌కు చెందిన వ్యాపారులు నలుగురు ఉన్నట్లు సమాచారం. వీరిపై కేసు నమోదు చేసి, 11మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. గుట్కా దందాలో ప్రకాశం గంజ్‌తోనే పెద్దఎత్తున్న సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ప్రకాశం గంజ్‌లోనే మూలాలు...

గుట్కా దందాలో నగరంలోని ప్రకాశం గంజ్‌తోనే పెద్దఎత్తున్న సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఇక్కడ ఉన్న కొందరు వ్యాపారులు అడ్డదారిలో సంపాదనే ధ్యేయంగా దందాను ప్రారంభించారని సమాచారం. ఒక ప్యాకెట్‌కు సుమారుగా రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తుండగా.. పోలీసులు పట్టుకున్న సరుకు విలువ బ్లాక్‌మార్కెట్‌లో రూ.కోట్లలో ఉండనుంది. ఈ దందా వెనక బడాబాబులు ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.


పోలీసులు సీజ్ చేసిన వాహనం

సూక్ష్మ కళ.. భళా

- బియ్యపు గింజతో శివలింగం
- స్వర్ణకారుడి నైపుణ్యం
- అబ్బురపరుస్తున్న కళాకారుడు

పెద్దపల్లిరూరల్: బియ్యంలోని రాళ్లను ఏరడం.. సూదిలో దారం దూర్చడమే కష్టమనుకునే ప్రస్తుత తరుణంలో ఏకంగా బియ్యపుగింజతో శివలింగం తయారు చేయడమే కాకుండా.. మరో బియ్యపుగింజలోకి ఆ శివలింగం దూర్చి అబ్బురపరుస్తున్నాడు పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన ఏలేశ్వరం సత్యబాపుచారి. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని తనలోని సూక్ష్మకళా నైపుణ్య ప్రదర్శించి అబ్బురపరుస్తున్నాడు.

బియ్యపుగింజతో శివలింగం

బియ్యపుగింజపై అక్షరాలు రాయడం, చాక్‌పీస్, సబ్బుబిళ్లపై బొమ్మలు గీసే కళాకారులను ఆదర్శంగా తీసుకుని ఏదోఒకటి వినూత్నంగా తయారు చేయాలనుకున్నాడు స్వర్ణకార వృత్తి చేసే సత్యబాపుచారి. ఆలోచన వచ్చిందే తడవుగా తన మేధాశక్తిని ఉపయోగించి బియ్యపుగింజపై శివలింగం రూపొందించాడు. మరో బియ్యపుగింజకు రంధ్రం చేసి ఈ శివలింగాన్ని అందులోంచి దూర్చి ఆకట్టుకున్నాడు. అంతేకాకుండా బియ్యంతో తయారుచేసిన శివలింగాన్ని ఆవగింజపై నిలబెట్టడం తన సూక్ష్మకళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది.

దారంపోగులు దూర్చి..

బియ్యపుగింజకు రంధ్రంచేసి అందులోంచి ఏకంగా 150 దాకా దారం పోగులను దూర్చి ఔరా అని అబ్బురపరుస్తున్నాడు సత్యబాపుచారి. తన సూక్ష్మ కళానైపుణ్యంతో 9 రకాల సూక్ష్మకళారూపాలు ప్రదర్శించడంతో తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డు ఇటీవల వరంగల్‌లో మహానంది జాతీయ పురస్కారంతోపాటు ప్రశంసాపత్రా అందించి సత్కరించారు.


బియ్యపు గింజతో తయారుచేసిన శివలింగాన్ని మరో బియ్యపుగింజలోకి దూరుస్తూ..
వివిధ ఆకారాల్లో శివలింగం


బియ్యపుగింజకు రంధ్రం చేసి 140 దారం పోగులను దూర్చిన కళాకారుడు


నెల్లూరులో పురస్కారం అందుకుంటూ..

వినూత్న ప్రయత్నమే లక్ష్యం



వినూత్నంగా ఆలోచించి అందరి దృష్టిని ఆకర్షించేలా చేయాలనే ఆలోచనతో బియ్యపుగింజతో శివలింగం తయారు చేశా. ఆ శివలింగాన్ని మరో బియ్యపు గింజలోకి దూర్చేలా ప్రయత్నించి విజయం సాధించా. అదే స్ఫూర్తితో బియ్యపుగింజకు రంధ్రం చేసి దారపు పోగులను దూర్చేందుకు యత్నించా. తొలుతకొంత ఇబ్బందిగా ఉన్నా ఇప్పుడు 150దాకా దారపు పోగులను సులువుగా దూర్చగలిగా. సూక్ష్మకళలో నైపుణ్యం సాధించి గుర్తింపు పొందేందుకు యత్నిస్తున్నా.

– ఏలేశ్వరం సత్యబాపు చారి, స్వర్ణకారుడు పెద్దబొంకూర్

అంజన్న తలనీలాల టెండర్ వాయిదా

- టెండర్‌లో కొత్తవారికి అవకాశం
- ఆలయ అభివృద్ధికి అధికారుల నిర్ణయం
- త్వరలోనే టెండర్ ప్రకటన జారీ

సాక్షి స్పందన

మల్యాల: కొండగట్టు ఆంజన్నకు భక్తులు సమర్పించే తలనీలాల సేకరణ టెండర్‌లో కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆలయ నిబంధలను సాకుగా చూపి.. కొత్తవారికి టెండర్‌లో పాల్గొనే అవకాశం లేకుండా చేసి.. ఉన్నవారు ఎంతంటే అంత అన్నచందంగా మార్చారు. దీనిపై 'తలనీలాల టెండ'రింగ్' శీర్షికన 'సాక్షి' ఈనెల 22న కథనం ప్రచురించింది. దీనిపై అధికారులు స్పందించారు. తలనీలాల టెండర్‌లో కొత్తవారు పాల్గొనేలా అవకాశం కల్పించారు. ఈ మేరకు ఈ నెల 24న నిర్వహించాల్సిన తలనీలాల టెండర్‌ను వాయిదా వేస్తూ ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు ప్రకటన విడుదల చేశారు. టెండర్ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

కొండగట్టు అంజన్న ఆలయానికి భక్తులు సమర్పించిన తలనీలాల (ఏడు నెలలు పోగు చేసిన)ను సేకరించేందుకు ఈనెల 18న టెండర్ నిర్వహించారు. ఇందులో 13మంది టెండర్‌దారులు పాల్గొన్నారు. సీల్డ్ కవర్ల అంశంపై పలువురు అభ్యంతరం తెలపడంతో అధికారులు ఈనెల 24కు వాయిదా వేశారు. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు వాయిదా వేసిన టెండర్‌లో కేవలం 13మంది మాత్రమే పాల్గొనవచ్చని, కొత్త వ్యక్తులు పాల్గొనే అవకాశం లేదంటూ అధికారులు నిరాకరించారు. టెండర్‌దారులు కుమ్మక్కై ఆలయ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం చేశారు. గతేడాది కూడా తలనీలాలను కిలో రూ.8500కే దక్కించుకున్నారు. ఈ ఏడాది కొద్దిపాటి మార్పుతో టెండర్ దక్కించుకునేందుకు కొంతమంది బినామీలతో కలిసి టెండర్‌లో పాల్గొన్నారు. అదే యాదాద్రిలో మాత్రం తలనీలాలకు కిలో రూ.20వేలు పలుకుతోంది. యాదాద్రిలో నిర్వహించిన టెండర్‌లో పాల్గొన్న వారే కొండగట్టులోనూ పాల్గొని బినామీలతో టెండర్‌ను దక్కించుకునే ప్రయత్నం చేశారు. ఈ లెక్కన ఆలయానికి సుమారు రూ.50లక్షలకు పైగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో 'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు తలనీలాల టెండర్‌లో కొత్తవారికి అవకాశం కల్పించేలా చేశారు.


కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం

దోపిడీ దొంగల ముఠా పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్


సీజ్ చేసిన కార్లు, బైక్‌లు

- ఎనిమిది మంది అరెస్ట్
- రెండు కార్లు, ద్విచక్ర వాహనాలు, ఫోన్లు స్వాధీనం

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడ బీరయ్య టెంపుల్ వద్ద పని నిమిత్తం వచ్చిన జగిత్యాల రూరల్ మండలం కల్లెడకు చెందిన ఇనుగుర్తి శంకరయ్యను ముగ్గురు బెదిరించి.. ఓ ఇంటికి తీసుకెళ్లి అతడి వద్దనున్న పావుతులం బంగారంతోపాటు రూ.లక్ష ఫోన్‌పే చేయించుకున్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కల్లెడకు చెందిన ఇనుగుర్తి ఈశ్వరయ్య మంగళవారం జగిత్యాలకు వచ్చాడు. అదే గ్రామానికి చెందిన బండి శ్రీకాంత్ ఫోన్‌చేసి ఎక్కడున్నాడో తెలుసుకొని.. హనుమాన్‌వాడలోని బీరయ్యగుడి వద్దకు చెట్ల మల్లేశ్, హనుమాన్‌వాడకు చెందిన పాలకుర్తి రాజుతో కలిసి చేరుకున్నాడు. శంకరయ్యను బెదిరించి, పాలకుర్తి రాజు ఇంట్లోకి తీసుకెళ్లి దాడిచేసి పావుతులం బంగారం లాక్కున్నారు. బాధితుడి ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా రూ.లక్ష బండి శ్రీకాంత్ ఖాతాకు పంపించుకున్నారు. అంతేకాకుండా మధ్యాహ్నం 3 గంటల సమయంలో బండి శ్రీకాంత్, చెట్ల మల్లేశంతోపాటు మరో ఇద్దరు జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఉల్లెందుల సతీశ్, పెగడపల్లి మండలం సుద్దపల్లికి చెందిన బదుగు మురళీ కారులో శంకరయ్యను ఎక్కించుకొని సారంగాపూర్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. కత్తులతో బెదిరించి మరిన్ని డబ్బులు డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలోనే సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన ఏలేటి మోహన్‌రెడ్డి, రేచపల్లికి చెందిన అన్నారం రఘు, బండి మధులను పిలిపించి అసలు విషయం తెలిపారు. దీంతో వారు కూడా అతన్ని బెదిరించేందుకు ఒప్పుకున్నారు. బాధితుడిని బైక్‌పై కల్లెడకు తీసుకెళ్లగా.. వాళ్ల అమ్మ మెడలోని పుస్తెలతాడును తీసుకొచ్చాడు. ఆ పుస్తెల తాడును జగిత్యాలలోని టవర్ ప్రాంతంలోని బాలాజీ జువెల్లరీ షాపులో విక్రయించి డబ్బులు తీసుకుంటుండగా బాధితుడి బావ తుమ్మనపల్లి రమేశ్ వచ్చి విషయం తెలుసుకొని ఠాణాకు వస్తుండగా మళ్లీ ఆపి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో మంగళవారం సాయంత్రం బాధితుడు శంకరయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు 8 మందిపై కేసు నమోదు చేసి 5 ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. వీరిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. వారి నుంచి పావుతులం బంగారం, ఫోన్‌పే ద్వారా రూ.లక్ష, రెండు బైక్‌లు, రెండు కార్లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బండి శ్రీకాంత్‌పై 22 కేసులు, పడెల మల్లేశంపై 3, పాలకుర్తి రాజుపై 10 కేసులున్నట్లు వివరించారు. కేసును తక్కువ సమయంలో ఛేదించిన పట్టణ సీఐ కరుణాకర్, పట్టణ ఎస్సై సుప్రియ, ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్‌ను ఎస్పీ అభినందించారు. రూరల్ సీఐ సుధాకర్, ఎస్సైలు సధాకర్, కుమారస్వామి, సుప్రియ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి ప్రాణాలు బలిగొన్న చేపల వేట


- ఎల్‌ఎండీలో మునిగి ఇద్దరి మృతి
- కరీంనగర్‌లో విషాదం


సయ్యద్ రిజ్వాన్, సయ్యద్ సర్వర్ మృతదేహాలు

తిమ్మాపూర్: కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరుడ్యాంలో చేపలవేటకు వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సయ్యద్ సర్వర్(52), అతని తమ్ముడి కొడుకు సయ్యద్ రిజ్వాన్(20), మహ్మద్ ఇసాక్ కలిసి బుధవారం ఉదయం ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లారు. తిమ్మాపూర్ పరిధిలోని తాపాలగుట్ట సమీపంలో గాలంతో చేపలు పడుతుండగా రిజ్వాన్ ప్రమాదవశాత్తు నీట మునిగాడు. సర్వర్ రిజ్వాన్‌ను కాపాడేదుకు ప్రయత్నిస్తుండగా ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. కొద్ది దూరంలో ఉన్న ఇసాక్, స్థానిక గంగపుత్రులు వారిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న సీఐ సదన్‌మార్, ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన అతివేగం.. నిద్రమత్తు

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఒకరి మృతి.. నలుగురికి గాయాలు


లారీని ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

తిమ్మాపూర్: అతివేగం.. నిద్రమత్తు ఒకరి ప్రాణం తీసింది. ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన తిమ్మాపూర్ మండలం రేణికుంటలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని టంగుటూర్ మండలం మణికొండ గ్రామానికి చెందిన సర్వేశ్వరావు హైదరాబాద్‌లోని కాలికాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన పెద్ద కొడుకు మన్నె రాఘవ(22), లంగరు లోకేశ్, స్నేహ స్నేహితులు. స్నేహకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో గంగాధరలో నాటు వైద్యం చేయించడానికి ఆమె తల్లిదండ్రులు రాజేశ్, లక్ష్మీతో కలిసి సెల్ఫ్ డ్రైవింగ్ కారు అద్దెకు తీసుకుని బుధవారం బయల్దేరారు. ఉదయం 10గంటలకు తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులోని టోల్‌గేట్ సమీపంలో రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని వీరి కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. రాఘవ, కారు నడుపుతున్న లోకేశ్, స్నేహ, రాజేష్, లక్ష్మీకి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మన్నె రాఘవ మరణించాడు. రాఘవ తండ్రి ఫిర్యాదు మేరకు లోకేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రాజన్న సన్నిధిలో వైభవంగా మహాలింగార్చన


స్వామి వారి అద్దాల మంటపంలో మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు, అధికారులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

పోరండ్లలో దొంగల బీభత్సం

- మూడిళ్లలో చోరీ

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సష్టించారు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చందనం సుగుణ నెల రోజుల క్రితం భర్త సత్యనారాయణ చనిపోవడంతో ఇల్లు వదిలిపెట్టి గ్రామంలోనే అద్దెకు ఉంటోంది. బుధవారం ఉదయం ఆమె కొడుకు మహేశ్ ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులకొట్టి ఉంది. బీరువాలోని మూడు తులాల బంగారం, 20తులాల వెండి, నగదు కనిపించలేదు. సుగుణ ఇంటితోపాటు మామిడిపల్లి తిరుపతి ఇంట్లో రెండు తులాల పుస్తెలతాడు, మామిడిపల్లి అంజవ్వ ఇంట్లో రెండు తులాల బంగారు బిస్కెట్ దొంగతనానికి గురైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దొంగల ముఠా కోసం గాలిస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

- నిందితుడికి రిమాండ్

ముత్తారం(మంథని): డివిజన్‌లోని ఓ గ్రామానికి చెందిన బాలికతో కాల్వశ్రీరాంపూర్ మండలం ఎదులాపూర్‌కు చెందిన చొప్పరి సదానందం(38)పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఈమేరకు బుధవారం మంథని కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు ఏసీపీ మల్లారెడ్డి విచారణ చేపట్టిన అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.1.10 కోట్లు


హుండీ లెక్కింపులో శ్రీలలిత సేవా ట్రస్టు సభ్యులు, అధికారులు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలోని 13 హుండీలకు భక్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం ఆలయ ఈఓ శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ పరిశీలకులు రాజమౌళి సమక్షంలో శ్రీలలిత సేవా ట్రస్టు సభ్యులు లెక్కించారు. 53 రోజులకుగాను రూ.1,10,03,402 వచ్చినట్లు పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ నోట్లు 61, మిశ్రమ వెండి, బంగారం తిరిగి బ్యాగుల్లో వేసి, సీల్ చేసి హుండీలో భద్రపరిచినట్లు ఈఓ తెలిపారు. స్థానాచార్యులు తిరుకోవెల కపీందర్, పర్యవేక్షకులు దేశిని సునీల్‌కుమార్, నీల చంద్రశేఖర్, గుండి హరిహరనాథ్, అశోక్‌కుమార్, సుధాకర్, రాములు, రవి కుమార్ పాల్గొన్నారు.

అడ్వాన్స్ డబ్బులు ఇవ్వాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న రాజిరెడ్డి కుటుంబసభ్యులు

పాలకుర్తి(రామగుండం): ఇంటి కొనుగోలు కోసం చెల్లించిన డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్న ఓ వ్యక్తి నివాసం ఎదుట బాధితులు ఆందోళన చేసిన ఘటన బుధవారం కన్నాల గ్రామ పంచాయతీ పరిధి బోడగుట్టపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడు పుప్పాల రాజిరెడ్డి కథనం ప్రకారం.. కన్నాలకు చెందిన మల్క లింగయ్య గతేడాది తనఇంటిని విక్రయించేందుకు నిర్ణయించగా.. రూ.46 లక్షలకు రాజిరెడ్డి కొనుగోలు చేసేందుకు అంగీకరించి తొలుత రూ.26లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. మిగతా సొమ్ము రిజిస్ట్రేషన్ సందర్భంగా చెల్లించేందుకు నిర్ణయించాడు. అయితే, ఏడాదిగా ఇంటి రిజిస్ట్రేషన్ చేయకుండా, అడ్వాన్సుగా ఇచ్చిన డబ్బులు కూడా తిరిగి చెల్లించకుండా మొండికేస్తున్నాడు. దీంతో తన డబ్బులు తనకు కావాలంటూ లింగయ్య ఇంటిగేట్‌కు రాజిరెడ్డి తాళం వేశాడు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే బైఠాయించాడు. చివరకు పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఎస్సై స్వామి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం పెద్దమనుషుల సమక్షంలో సమస్య పరిష్కరించుకుంటామని లింగయ్య హామీ ఇచ్చారు. దీంతో రాజిరెడ్డి కుటుంబం ఆందోళన విరమించింది.

వృద్ధ దంపతులపై దాడి చేసి బంగారు ఆభరణాలు చోరీ

- డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల గాలింపు


దంపతుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రఘుచందర్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లి ఊరు చివర ఉంటున్న వృద్ధ దంపతుల ఇంట్లో బుధవారం వేకువజామున దొంగలు చొరబడ్డారు. దంపతులపై దాడి చేసి బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బీర్‌పూర్ ఎస్సై రాజు కథనం ప్రకారం.. రేకులపల్లి ఊరుచివరలో సురారపు గంగయ్య (80) భార్య రాజవ్వతో కలిసి నివాసం ఉంటున్నారు. వేకువజాము మూడు గంటల ప్రాంతంలో గంగయ్య ఇంటి వెనుక ఉన్న తలుపులు పగులగొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. రాజవ్వ మెడలో ఉన్న ఆభరణాలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా.. గంగయ్య అడ్డుకున్నాడు. దీంతో దొంగలు తమ వెంట తెచ్చుకున్న ఆయుధంతో గంగయ్యపై దాడి చేశారు. ఈ ఘటనలో గంగయ్య తొడకు బలమైన గాయమైంది. రాజవ్వపై ఉన్న తులం బంగారు కుత్తికట్టు, గ్రాము ముక్కు పుడక, చేతులకున్న 40 తులాల వెండికడియాలు, సెల్ ఫోన్ లాక్కొని తిరిగి ఇంటి వెనుక నుంచి పరారయ్యారు. ఇద్దరు దొంగలు నల్లటి దుస్తులు, షూలు ధరించి ఉన్నట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై రాజు పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంల సహాయంతో గాలింపులు చేపట్టారు.

నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్


రుద్ర వేణుగోపాల్‌ను అరెస్టు చూపుతున్న సీఐ సురేష్ బాబు

కోరుట్ల: కోరుట్లలో కొంతకాలంగా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న రుద్ర వేణుగోపాల్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సురేష్ బాబు కథనం ప్రకారం.. వేణుగోపాల్ పట్టణంలోని పోచమ్మవాడలో మంత్ర ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. రెండేళ్లుగా ఫొటోషాప్ ద్వారా ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెమోలు తయారు చేస్తూ అవసరం ఉన్నవారికి విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారంతో అందడంతో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి దాడి చేసి వేణుగోపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 106 నకిలీ ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, డెత్ సర్టిఫికెట్లు, కంప్యూటర్, కలర్ ప్రింటర్, పేపర్ కటింగ్, ల్యామినేషన్ మిషన్, మానిటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు శ్రీనివాస్, రాజు, అఫ్రోజ్, సాజిద్, వినోద్, సురేష్, కమలాకర్ పాల్గొన్నారు. వీరిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

ముగ్గురు దొంగలపై కేసులు


అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి, పోలీస్ సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల తంగళ్లపల్లి మండలంలో కొంతకాలంగా ద్విచక్ర వాహనాలను దొంగతనానికి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలంలో కొంతకాలంగా ఆడెపు రవికుమార్, మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. వీరిలో ఇద్దరిని పట్టుకోగా ఒకరు పరారీలో ఉన్నాడు. వీరు ఏడు నెలలుగా మండలంతోపాటు ముస్తాబాద్, మాచారెడ్డి, సిరిసిల్ల, వేములవాడలో 10 ద్విచక్ర వాహనాలను దొంగిలించారు. వీటిలో కొన్ని బైకులను చందుర్తి, కరీంనగర్, సిరిసిల్లలోని కొందరికి విక్రయించారు. ఈ బైకులను కొన్న వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేసి బైకులు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై ఉపేంద్రాచారి, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, బాలనర్సయ్య, కానిస్టేబుల్ నరేందర్, రామ్మోహన్, వికాస్‌లను అభినందించారు.

మిడ్‌మానేరుకు ఇన్‌ఫ్లో



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి మూలవాగు, మానేరువాగుల్లో నుంచి 210 క్యూసెక్కుల మేర స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో బుధవారం 6.84 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.